ఘనంగా శ్రీవారి కల్యాణమహోత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు, అర్చకులు తులసీరమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా రెండో ఆదివారం శ్రీవారి కల్యాణం జరిపిస్తామని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు.

వైభవంగా బాలాజీ బ్రహ్మోత్సవాలు..

అల్వాల్: ఓల్డ్ అల్వాల్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ప్రత్యేక హోమాలు, శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, విజయసారధి, ఆలయ అర్చకులు రఘు, వంశీ, శ్రీనివాస్, రమణ, రాజు, సేవా కార్యకర్తలు శివరామకృష్ణ, వెంకటరామిరెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంచందర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

త్వరలోనే ఆర్‌యూబీ పనులు : ఎమ్మెల్యే మర్రి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కేశవనగర్ కాలనీవాసులు

మల్కాజిగిరి/అల్వాల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. వాజుపేయినగర్ ఆర్‌యూబీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదివారం కేశవనగర్ కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఆర్‌యూబీ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారన్నారు. దీనికి బల్దియా, రెవెన్యూ, రైల్వే విభాగం అధికారులు పూర్తిగా సహకరించారన్నారు. అభివృద్ధిని అడ్డుకునే వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ప్రజాక్షేత్రంలో అభివృద్ధిని అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. గంగాధర్‌గౌడ్, సర్వేష్‌యాదవ్, ఈశ్వర్‌గౌడ్, నవీన్, జనార్దన్, బ్రహ్మచారి తదితరులున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనగర్ కాలనీవాసులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీ (ఈస్ట్)లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని, వీధిదీపాలు ఏర్పాటు సహా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని, త్వరలోనే కాలనీలో అధికారులతో కలిసి పర్యటిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నేతలు రమేష్, కాలనీవాసులు పాండురంగం, నాగభూషణం, వెంకటేశ్వర్‌రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బధిరులకు క్విజ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

అల్వాల్: ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా 'ఎల్‌టీఐ మైండ్ ట్రీ' సంస్థ సహకారంతో నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లెర్ బధిరుల కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి దాదాపు 80 మంది ప్రత్యేక విద్యార్థులు హాజరయ్యారు. సంస్థ ప్రతినిధి దివాకర్, జాతీయ మానసిక వికలాంగుల సంస్థ ప్రిన్సిపాల్ గణేష్, జాతీయ బధిరుల సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి హాజరై ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెలెన్ కెల్లెర్ ఇనిస్టిట్యూట్ సంస్థాపకులు పటాన్ ఉమర్‌ఖాన్, తెలంగాణ ఎన్జీవోస్ ఫెడరేషన్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, సేవా ఇన్‌ఆక్షన్ సంస్థ ప్రతినిధి డాక్టర్ మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మల్లాపూర్: మల్లాపూర్ దుర్గానగర్ ప్రభుత్వ పాఠశాలలో బద్రి విశాల్, పన్నాలాల్ ప్రీతి ట్రస్ట్, అగర్వాల్ సేవాదల్, యాదవుల సేవా సంఘం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి, అనంతరం మందులను అందజేశారు. శ్రీకాంత్‌యాదవ్, శరత్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, స్థానిక నేతలు మహేందర్, పీఆర్.ప్రవీణ్, శ్రీనివాస్, ఎల్‌సీఎస్ దండు ఐ ఇనిస్టిట్యూట్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి, భగవాన్ మహవీర్, వికలాంగ్ సహాయక సమితి సభ్యులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం !

- మరమ్మతులకు నోచుకోని వైనం
- తీవ్ర ఇబ్బందిపడుతున్న ప్రజలు



కాప్రాలో గుంతలమయంగా మారిన రోడ్లు

కాప్రా: రోడ్ల పరిస్థితి రోజురోజుకు అధ్వానంగా మారుతోంది. కాప్రాలో పలు కాలనీల్లోని రోడ్లు మరమ్మతులకు నోచుకోక గుంతలమయమయ్యాయి. శాలివాహన ఎన్‌క్లేవ్, అరుల్‌కాలనీ, ఆదిత్యనగర్‌లో రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. నిత్యం స్కూల్, ఆఫీస్, ఇతర పనులపై వెళ్లే నగరవాసులు మరమ్మతులకు గురైౖ రోడ్లపై ప్రయాణించలేక నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఇంటి నుంచి బయటికెళ్తే చాలు గతుకుల రోడ్లలో ఎక్కడ ప్రమాదానికి గురౌతామోనని భయంతో ప్రయాణం సాగిస్తున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు..

కాలనీలో రోడ్లు మరమ్మతులకు నోచుకోక ఇబ్బందులు పడుతుంటే ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకున్న పాపాన పోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధే లక్ష్యమంటూ చెబుతున్న నేతలకు ఈ గుంతల రోడ్లు కనిపించడంలేదా.. ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారులెక్కడా.. ?

ప్రజా ప్రతినిధులను పక్కన పెడితే అధికారులు ఏం చేస్తున్నారని, సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత వారిది కాదా..!అని కాలనీ వాసులు అడుగుతున్నారు.

ఆదమరిస్తే ఆస్పత్రి పాలే..

నిత్యం ప్రయాణించే రోడ్లపైనే కాస్త.. ఆదమరిచి వెళ్లామో.. అంతే ఆస్పత్రి పాలే అంటూ స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు. నెలల తరబడి ఈ పరిస్థితి ఉన్నా కన్నెత్తి చూసేవారే కరువయ్యారని ఆవేదన చెందుతున్నారు.

రాత్రిళ్లు అంధకారంగా..

ఇక రాత్రి వేళ అయితే ఈ రోడ్లపై ప్రయాణించే పరిస్థితే ఉండదని, ప్రజలు అంటున్నారు. ఎక్కడ గుంత ఉందో.. తెలియక ప్రమాదాల భారిన పడుతున్నామని, పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కుచించుకుపోయిన రహదారి..

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్



ఉప్పల్ ఈ- సేవా రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు

ఉప్పల్: ఉప్పల్ స్టేడియం మెట్రోస్టేషన్ వద్ద రూ. కోటి నిధులతో ఈ సేవా పక్కలేన్ 40 ఫీట్ల రోడ్డు వేశారు. ఇదే అదునుగా దాదాపు 600 మీటర్లకు పైగా రోడ్డంతా ద్విచక్ర వాహనాలు, కార్లను పార్కింగ్‌గా మారింది. దీంతో ఇతర వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేడియం మెట్రోస్టేషన్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు నిత్యం ఇక్కడే దర్జాగా తమ వాహనాలను పార్క్ చేసి వెళ్లిపోవడంతో 40 ఫీట్ల రోడ్డు 20 ఫీట్లకు కుంచించుకుపోయింది. దీనిపై అనేకసార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని, నామమాత్రపు చర్యలు చేపట్టారని, శాశ్వత పరిష్కారం చూపలేదని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాహనాలను పార్క్ చేయకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



గౌతంనగర్: గౌతంనగర్ కాలనీ దుర్గామాత ఆలయం సమీపంలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక నేతలు శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపారు. ఆదివారం కాలనీలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, రోడ్లను పరిశీలించారు. స్థానిక సమస్యలపై ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

దుస్తుల పంపిణీ

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం క్రిస్మస్ పండుగ సందర్భంగా జిప్సీ చర్చి సభ్యులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ అంటేనే ఇచ్చి పుచ్చుకోవడం అన్నారు. మనకు ఉన్న దాంట్లో ఎంతో కొంత పేదలకు దానం చేయాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, డాక్టర్లు రవితేజ్, ధరణి, పాస్టర్ పన్నీర్ సెల్వం పాల్గొన్నారు.

అనాథలకు పుష్ప సినిమా టికెట్లు

ఉప్పల్: రంజిత్ అండ్ టీమ్ సాయి సేవా సమితి, సాయిబాబా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉప్పల్ శ్రీకృష్ణ థియేటర్‌లో అనాథ పిల్లలకు పుష్ప సినిమాను టికెట్లు కొనిచ్చి చూపించారు. అల్లుఅర్జున్ అభిమానులు, మామిళ్ల రాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



మహా పడిపూజలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



అయ్యప్ప మహాపడి పూజలో స్వాములు

రామంతాపూర్ : ఇందిరానగర్‌లో మసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నియమనిబంధనలతో నిష్టగా అయ్యప్ప మండల దీక్ష పూర్తిచేసిన వారికి అన్ని శుభాలే జరుగుతాయన్నారు. బీజేపీ నేతలు బండారు వెంకటరావు, నారాయణదాసు, కుమార్ పాల్గొన్నారు.

◆ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఇరుముడి కట్టుకుని గురుస్వాములు గిరిబాబు, బిక్షపతి, శంకరయ్య, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, బ్రహ్మచార్యులు ఆదివారం శబరియాత్రకు తరలివెళ్లారు.

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సంతోష్‌నగర్ గ్రీన్ గోల్డ్ అపార్ట్‌మెంట్‌లో రాజు ముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పర్యటన

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రతి ఆదివారం కాలనీలలో పర్యటిస్తున్నామని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. బాబానగర్‌లో పర్యటించిన ఆయన తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.కృష్ణారెడ్డి, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్, షాహిద్, జాఫర్, భారతమ్మ తదితరులున్నారు.

అందరికీ సముచిత స్థానం

కుషాయిగూడ: రాష్ట్రంలో అందరికీ సముచిత స్థానం కల్పించడమే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. ట్రాఫిక్ విభాగంలో నియమితులైన ట్రాన్స్‌జెండర్స్ ఆదివారం కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం నిర్ణయంతో ట్రాన్స్‌జెండర్స్ బతుకుల్లో వెలుగులు నింపనుందని, వారు ఆకాంక్షించారు.



కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో ట్రాన్స్‌జెండర్లు

ప్రారంభమైన విగ్రహ నిర్మాణ పనులు

కుషాయిగూడ: చర్లపల్లి మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద చర్లపల్లి చౌరస్తాలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల నిర్మాణ పనులను సంక్షేమసంఘం ప్రతినిధులు ఆదివారం ప్రారంభించారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు కడియాల జనార్దన్, యాదగిరి, నర్సింగరావు, గిరిబాబు, రమేష్, కుమార్, నగేష్, సురేష్, దర్శనం, కృష్ణ, శ్రీనివాస్, భరత్‌రాజ్, సురేష్, నందకిషోర్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు

కాప్రా: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలు కాప్రా సర్కిల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్‌నగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అనంతరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించి ఏడాది కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్‌నాయక్, కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, నాయకులు గుణశేఖర్, ధర్మేందర్, మల్లారెడ్డి, శ్రీధర్, రాజు, శ్రీకాంత్, శ్రీహరి, సంతోష్‌చారి, సతీష్‌యాదవ్, జగదీష్, మనోజ్, జీవన్, ప్రశాంత్, ఇమ్రాన్, చందు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం..

రామంతాపూర్: ఓల్డ్ విలేజ్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదివాకం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలే ధ్యేయంగా పనిచేస్తోందని అభిప్రాయపడ్డారు. అర్హులైన ప్రజలు ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకుని లబ్ధిపొందాలని సూచించారు. ఉప్పల్ సర్కిల్‌లోని భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేత తోఫిక్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ పటేల్, శ్రీకాంత్‌యాదవ్, జలీల్ పాషా, సుధాకర్, భాస్కర్, సతీష్‌గౌడ్, రాజిరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి..

మల్లాపూర్: కాంగ్రెస్ ఏడాదిపాలనలో ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నిధులు విడుదల చేసి అభివృద్ధికి పాటుపడుతున్నారని, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కప్పెర సాయిగౌడ్ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను మల్లాపూర్‌లో నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు ఉమేష్‌గౌడ్, రాజు, సుదర్శన్, అనీల్, ఎస్వీ కిట్టు, గట్టయ్య, జమీల్ బేగం, ఉపేందర్ రెడ్డి, జోష్, కరుణాకర్, పర్వతాలు, రాజేష్, మనోహర్, శైలజ, ఇంతియాజ్‌బేగం, సోని, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌నగర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు



పరమేశ్వర్‌రెడ్డితో కాంగ్రెస్ నేతలు

ప్రియురాలి జ్ఞాపకాలను మరిచిపోలేక..

యువకుడి ఆత్మహత్య



రఘుప్రసాద్(ఫైల్)

ఉప్పల్: ప్రేమించిన యువతి ఆత్మహత్య చేసుకుందని మనస్థాపంతో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టలో నివాసం ఉండే నిలుగూరి కుమార్ వృత్తిరీత్యా సెంట్రింగ్ మేస్త్రీ. కాగా అతడి చిన్న కుమారుడు రఘుప్రసాద్(20) డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గత 6 నెలల క్రితం జగద్గిరిగుట్టలో నివాసం ఉండే మేఘనతో సఖ్యతగా ఉండేవాడు. కాగా తన క్లాస్‌మెట్ బైక్‌పై సదరు యువతిని చూసిన రఘు ఫోన్‌చేసి తిట్టాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంటికెళ్లి ఆత్మహత్య చేసుకుంది. దీంతో యువతి కుటుంబసభ్యులు ఆత్మహత్యకు కారణం రఘుప్రసాద్ కారణమని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రఘుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి వచ్చిన తరువాత కుమార్ కుటుంబం 3 నెలల క్రితం ఉప్పల్‌కు వచ్చి అజమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున రఘు చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన కార్యవర్గం

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ సీఫెల్ కాలనీ నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా పి.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఓంరాజ్, ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఆర్. చంద్రకళ, కోశాధికారిగా శేషగిరిరావు, సలహాదారులుగా సోమయ్య , చంద్రకళ, పెద్దిరాజును ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. కాలనీలో అభివృద్ధి పనులు జరగడానికి ప్రజాప్రతినిధుల పూర్తి సహకారం తీసుకుంటామన్నారు.

నేడు సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లోని శ్రీషిర్డి సాయిబాబా దేవాలయంలో నేడు 42వ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, శ్రీసాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రకటించారు.

పేదలకు మరిన్ని వైద్య సేవలు



మందులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్

బోడుప్పల్: పేద, మధ్యతరగతి ప్రజలకు మరిన్ని ఉచిత వైద్యసేవలు అందాలని 12వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్‌కుమార్ ఆకాంక్షించారు. అంబేడ్కర్‌నగర్ బస్తీ దవాఖాన దగ్గర ఆదివారం పరమిత ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

దశలవారీగా అభివృద్ధి పనులు



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 4వ డివిజన్ పరిధిలో సీసీరోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన..

బోడుప్పల్: చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. చెంగిచర్లలో 'ఐ' స్కూల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్నతనం నుంచి విలువలతో కూడిన విద్యతో పాటు దేశసంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలన్నారు. పీర్జాదిగూడ మేయర్ అమర్‌సింగ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, సుమన్‌నాయక్, కో-ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, నియోజకవర్గ బీ - బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



బోడుప్పల్: చెంగిచర్ల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా క్రిష్ణగౌడ్, ఉపాధ్యక్షులుగా బాలరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బొడిగె మల్లేష్‌గౌడ్, కోశాధికారిగా రాజుగౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సంఘం ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పద్మజ విశ్వాస్ వారి తరంగిణి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గాత్ర కచేరి, కీబోర్డు, వయోలీన్ ప్లే లాంటి ప్రదర్శనలు అబ్బురపరిచాయి. టీవీ ఆర్టిస్ట్ చంద్రశేఖర్ పాల్గొని కళాకారులను అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



రామకృష్ణ (ఫైల్)

కాప్రా: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి డివిజన్ వాసవీశివనగర్‌లోని వాసవి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే దైవసాని రామకృష్ణ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. శనివారం రాత్రి కాప్రా శ్రీరాంనగర్ కాలనీలో నివాసం ఉండే తన సోదరి ఇంటికి వెళ్తుండగా.. మార్గమధ్యలో వెనుక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. దీంతో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా.. చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు.

బైక్ అదుపుతప్పి మరో వ్యక్తి ..



నవనీత్ (ఫైల్)

సైనిక్‌పురి సాయిబాబా ఆఫీసర్స్‌కు చెందిన నవనీత్ అనే వ్యక్తి బైక్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి వర్షం కురుస్తుండగా.. రోడ్డుపై నీళ్ల చేరడంతో తాను ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో నవనీత్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.